
Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:6(1), June: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd June 2023
Publication Date:30th June 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.06.20
www.ijmer.in

# ఆదివాసీలు - జీవన చిత్రణ

**డా॥ ఆర్.కుసుమ కుమారి**
అసిస్టెంట్ ప్రొఫెసర్
డా॥ వి.యస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ & పి.జి కళాశాల (స్వ)
విశాఖపట్నం.
చరవాణి : 99636 25639

**పరిచయం :**

ఆదివాసీలు సాధారణంగా అడవుల్లో, కొండ ప్రాంతాలలో నివసిస్తుంటారు. వీరిని ఆదివాసులు, ఆటవికులు, వనవాసులు, గిరిజనులు అని రకరకాల పేర్లతో పిలుస్తారు. భారతదేశంలో సుమారు 570 వరకు ఆదివాసీ తెగలు ఉన్నాయని అంచనా వేయబడింది. ప్రతి రాష్ట్రంలోనూ ఆదివాసీలు ఉన్నా ముఖ్యంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, బీహార్, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మొదలైన ప్రాంతాలలో వీరిలో ఎక్కువ తెగలు నివసిస్తున్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో 33 తెగల వారు ఉన్నారని అంచనా వేయబడింది.

ఆదివాసీల సామాజిక వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, పండగలు, పూజలు మొదలైన వాటిలో ప్రత్యేకత కలిగి ఉంటారు. కానీ ప్రస్తుతం మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆదివాసీల జీవన విధానంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ఆధునిక కాలంలో గ్రామీణ సమాజం, ఆదివాసీ సమాజం, నాగరిక సమాజాల మధ్య ఉండే భేదం చాలా వరకు సమసిపోతూ ఉంది.

**ఆదివాసీల సామాజిక వ్యవస్థ – కుటుంబం :**

పూర్వకాలంలోని మాతృస్వామిక వ్యవస్థ నుండి పితృస్వామిక వ్యవస్థలో అడుగుపెట్టిన తరువాత ఆదివాసీల సామాజిక వ్యవస్థలో కుటుంబాలు అనేవి పితృవంశాల ఆధారంగా ఏర్పడ్డాయి. ఆస్తి పురుషుల నుండి పురుషులకి మాత్రమే వారసత్వంగా వస్తుంది. ఆదివాసీలలో వివాహమైన వెంటనే నూతన దంపతులకు ఒక కొత్త గుడిసెను వేసి, అందులో కాపురం పెట్టిస్తారు. దీనిని "ఇల్లు చేయడం" అంటారు.

ఆదివాసీలు చిన్న చిన్న కుటుంబాలుగా విభజింపబడినా అవసరానికి ఒకరికొకరు ఆదుకోవడం వీరిలో కనిపిస్తుంది. వ్యవసాయం ప్రధానవృత్తిగా కలిగిన గోండు జాతిలో మాత్రం "ఊడిగం" పద్ధతి ఆచరణలో ఉండడం వలన వారు ఉమ్మడి కుటుంబాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మిగిలిన తెగలలో ముగ్గురు లేదా నలుగురు కుటుంబ సభ్యులు కలిగిన కుటుంబాలే అధికంగా ఉన్నాయి.

**ఆదివాసీల వృత్తులు :**

ఆదివాసీలు జీవనోపాధికి అనుసరించే వృత్తులు ప్రధానంగా 3 రకాలు.

1. అడవి నుండి ఆహారం సేకరణ
2. పోడు వ్యవసాయం
3. ఇతర వృత్తులు

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:6(1), June: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd June 2023
Publication Date:30th June 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.06.20
www.ijmer.in

**1. అడవి నుండి ఆహారం సేకరణ :**

వేట ఆదివాసీల ప్రాథమిక వృత్తి. వేటాడడంలో వీరు స్వతహాగా నేర్పరులు. వీరు వివిధ రకాల వలలు, బోనులు, ఉరులు, త్రాళ్ళు, విల్లు లాంటివి ఉపయోగించి అడవిలో జంతువులను వేటాడతారు. భక్త కన్నప్పగా ప్రసిద్ధి చెందిన తిన్నడు చిన్ననాడు వేటాడిన వేటలన్నీ ఆదివాసీల వేటలే. వీరు అమూల్యమైన అటవీ సంపదను పోగు చేసి సంతలలో వస్తు మార్పిడి పద్ధతి (బార్టర్ సిస్టమ్) ద్వారా మార్చుకొని తమకు కావలసిన నిత్యవసర వస్తువులను తెచ్చుకుంటారు.

**2. పోడు వ్యవసాయం :**

పోడు వ్యవసాయంలో శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ. దీని వలన ప్రకృతి అసమతుల్యానికి గరవుతుంది. ఆదివాసీలు బ్రతుకుతెరువుకు కొండ ప్రదేశాలలో కొద్దిపాటి చదును భూములను ఎన్నుకొని, ఆ భూమిలోని చెట్లు నరికి వాటిని తగలబెట్టి బూడిదను ఎరువుగా ఉపయోగించి పోడు వ్యవసాయం చేస్తారు. ఇందులో వీరు జొన్న, రాగులు, ప్రత్తి, మినుములు, బఠానీలు వంటి పంటలు పండిస్తారు. రెండు మూడు సంవత్సరాలు ఆ భూమిని సాగు చేసిన తరువాత భూసారం క్షీణించిందని వేరే ప్రాంతాలను ఎన్నుకొని అక్కడి నుండి వెళ్ళిపోతారు.

పోడు వ్యవసాయంలో స్థిరత్వం లేకపోవడం వలన వీరు ఎక్కువగా సంచార జీవనం సాగిస్తారు. వారి ఇళ్ళు కూడా దానికి తగినట్లుగా తాత్కాలిక వసతులు ఉన్నట్లు నిర్మిస్తారు. చుట్టూ గుండ్రని ఆకారంలో అడుగు ఎత్తు మట్టిగోడను కట్టి, దానిపైన కట్టెలు ఆధారంగా గుడిసె ఆకారంలో గడ్డిని కాని, అడవిలో దొరికే ఆకులను కాని కప్పుగా వేసి వాటిలో జీవితాన్ని సాగిస్తారు. కొండరెడ్ల, ఖోండులు, సవరలు పోడు వ్యవసాయం చేయడంలో నేర్పరులు.

**3. ఇతర వృత్తులు :**

ఆదివాసీలలో వ్యవసాయం చేసుకోవడానికి తగిన వసతులు లేనివారే ఎక్కువగా ఉంటారు. వీరు వ్యవసాయ కూలీలుగా చేరుతుంటారు. అడవిలో కాఫీ, పట్టుపురుగులు, తేనెటీగలు పెంచడం మొదలైనవి ఇతర వృత్తులుగా కలిగి ఉంటారు. వరంగల్, ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో నివసించే కోయలు, విశాఖపట్టణం జిల్లాలోని భగత, వాల్మీకి, కోడియా, మూక దొర జాతులకు చెందిన ఆదివాసీలు నాగలితో మామూలు వ్యవసాయం చేస్తున్నారు.

మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం జిల్లాలలో నల్లమల అడవులలో నివసించే చెంచులు వెదురును నరకడం, జిగురు, తేనెను సేకరించడంలో ప్రవీణులు. చెంచులు అడవులలోకి వెళ్ళేటప్పుడు బాకులు, విల్లు, చిన్న కత్తిని వెంట తీసుకెళ్తారు. వీరు తేనెను సేకరించడానికి వెళ్ళినప్పుడు సోదరులతో కాకుండా బావమరుదుల గుంపులతో వెళ్తారు. విశాఖపట్నం మన్యం ప్రాంతంలో నివసించే గౌడులు, తెలంగాణా ప్రాంతపు సుగాలీలు (లంబాడీలు) అనాది నుండి పశువులను పెంచడంలో ఆరితేరినవారు.

**ఆచార వ్యవహారాలు – వివాహం :**

ఆదివాసీల ఆచార వ్యవహారాలలో జననం, వివాహం, మరణం ముఖ్యమైనవి. వీరి సంతానంలో ఆడపిల్లల కన్నా మగపిల్లలకే అధిక ప్రాధాన్యత ఉంటుంది. మగపిల్లలు తమకు వేటలో, పోడు వ్యవసాయంలో తోడ్పడతారని ఆశ. మగపిల్లవాడు పుడితే బాణంతోను, ఆడపిల్ల పుడితే కొడవలితోను బొడ్డు కోసి పాతిపెడతారు. పిల్లలు పెద్దవారైన తర్వాత మగ పిల్లవాడైతే బాణాన్ని ఉపయోగించి వేటాడతాడని, ఆడపిల్ల అయితే కొడవలిని ఉపయోగించి పొలం పనులలో పనిచేస్తుందని ప్రతీకగా అలా చేస్తారు.

Cover Page

**INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH**
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:6(1), June: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd June 2023
Publication Date:30th June 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.06.20
www.ijmer.in

ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీ తెగలలో 5 రకాల వివాహాల్ని వారి యొక్క సమాజం ఆమోదిస్తుంది.

1. సంప్రదింపుల ద్వారా వివాహం
2. అపహరణ ద్వారా వివాహం
3. పరస్పరం ప్రేమించుకొని లేచిపోవడం ద్వారా వివాహం
4. సేవ ద్వారా వివాహం
5. చొచ్చుకుపోవడం ద్వారా వివాహం

**1. సంప్రదింపుల ద్వారా వివాహం :**

సంప్రదింపుల ద్వారా వివాహంలో పెళ్ళికుమారుని వైపు వారు సారాయి తీసుకొని పెళ్ళికుమార్తె ఇంటికి వెళతారు. తాము వచ్చిన సంగతి సూటిగా చెప్పకుండా మీ తోటలోని ఒక పువ్వు కొరకై వచ్చినామని మీ పుష్పాన్ని (కన్యను) మా అబ్బాయికిస్తారా? అని అడుగుతారు. పిల్లవైపు వారు తమ సమ్మతిని తెలియజేస్తే ఇరుపక్షాల వారు కలిసి సారాయి సేవిస్తారు. ఆదివాసీ తెగలలో వరశుల్కం ఉండదు. కన్యాశుల్కం మాత్రమే ఉంటుంది. వివాహం వరుని ఇంటి వద్దనే జరుగుతుంది. వరుని ఇంటి వద్ద విందు ముగిసిన తర్వాత అందరూ కలిసి నృత్యం చేస్తారు.

**2. అపహరణ ద్వారా వివాహం :**


అపహరణ ద్వారా జరిగే వివాహ పద్ధతి ఇంచుమించు అన్ని ఆదివాసీ సమాజాలలో బహుళ ప్రచారం పొందింది. ఆదిమవాసులలో చాలామంది ఖర్చు భరించలేనివారు ఈ పద్ధతిలోనే వివాహం చేసుకుంటారు. ఒక వేళ కన్య అభీష్టానికి వ్యతిరేకంగా అపహరణం చేస్తే పిల్లవాని తరుపు వాళ్ళు గ్రామ పెద్దల మండలికి 12 రూపాయలు జరిమానా చెల్లించి, ఆ కన్యను ఆమె తల్లిదండ్రుల దగ్గరికి సురక్షితంగా పంపిస్తారు. పిల్ల ఇష్టపడితే వరుని పక్షం వారు తగినంత కన్యాశుల్కం పిల్ల తల్లిదండ్రులకు ఇచ్చి వివాహం చేసుకుంటారు.

**3. పరస్పరం ప్రేమించుకొని లేచిపోవడం ద్వారా వివాహం :**

ఈ రకమైన వివాహం అనేది యువతీ యువకులు తల్లిదండ్రులు వారి వివాహానికి అంగీకరించకపోతే జరుగుతుంది. లేచిపోయిన యువతీ యువకులు కొన్ని నెలలకు తల్లిదండ్రుల కోపం తగ్గిన తరువాత తిరిగి వస్తారు. కాబోయే అల్లుడు మామగారికి కన్యాశుల్కం పంపిస్తాడు. ఈ లేచిపోవడం అనేది అవివాహితుల మధ్యనే గాక ఇరువురికి గానీ వారిలో ఒకరు గానీ వివాహితులు కావచ్చు. ఒక మగవాడు పెళ్ళి అయిన ఆమెతో లేచిపోతే అతడు ఆమె పూర్వపు భర్తకు “మగనోలి” చెల్లించాలి. ఈ ఆచారం ఇంచుమించుగా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని తెగల్లోనూ ఉంది. స్త్రీ కొత్త భర్త దగ్గరికి పోయినపుడు తన పిల్లలను వదలిపోతుంది. ఆ పిల్లల సంరక్షణ బాధ్యత తండ్రిదే. ఎరుకల స్త్రీ ఏడు సార్లు వరకు పునర్వివాహం చేసుకోవడానికి సమాజం అంగీకరిస్తుంది.

**4. సేవ ద్వారా వివాహం :**

సేవ ద్వారా వివాహం జరిగే పద్ధతిలో యువకుడు కన్యాశుల్కాన్ని చెల్లించలేని పరిస్థితిలో పిల్ల యింటిలో నిర్ణయించినంత కాలం పనిచేయాలి. ఈ కాలంలో మామగారికి పొలం పనులలో గాని, ఇతర పనులలో గాని సహాయపడుతూ ఉండాలి. నిర్ణీత సమయం ముగిసిన తరువాత పిల్ల తండ్రి తన ఇంట వివాహాన్ని జరిపి వధూవరులను వారి గ్రామానికి పంపించివేస్తాడు. ఒక వేళ మామగారికి పురుష సంతానం లేనట్లయితే కూతురుని, అల్లుణ్ణి తన ఇంట్లోనే ఉంచుకుంటాడు.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:6(1), June: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd June 2023
Publication Date:30th June 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.06.20
www.ijmer.in

**5. చొచ్చుకుపోవడం ద్వారా వివాహం :**

ఈ రకమైన వివాహ పద్ధతిలో ఒక అమ్మాయి ఒక యువకుడిని వివాహమాడగోరితే అందుకతడు నిరాకరిస్తే ఆమె అతని ఇంట్లోకి చొచ్చుకు వచ్చి అక్కడే ఉంటుంది. పిల్లవాడూ, అతని తల్లిదండ్రులూ వివాహానికి రాజీపడే వరకూ ఆ ఇల్లు విడిచిపెట్టదు. ఈ రకమైన వివాహం అదిలాబాదు జిల్లాలోని గోండులు, కోలంలో కనిపిస్తాయి. సవరలలో, మరికొన్ని తెగలలో పెళ్ళికొడుకు కట్నం తీసుకోవడమనే ఆచారం కనిపిస్తుంది.

ఆదివాసులలో చనిపోయిన సోదరుని భార్యను ఆమె ఇష్టపడినట్లయితే వివాహం చేసుకునే పద్ధతి ఉన్నది. చనిపోయిన వాని సోదరుడు విధవను చీరతో కప్పి గాజులు ఇస్తాడు. దీనితో ఆమె అతని భార్య అవుతుంది. భార్య చెల్లిని వివాహమాడే పద్ధతి కూడా ఆదివాసులలో ఉంది. "ఎక్కడెవరు దొరక్కపోతే అక్క మొగుడే దిక్కు" అనే సామెత ఈ పద్ధతినే సూచిస్తుంది.

**పండగలు, పూజలు :**

మతం ప్రాతిపదికగా ఆదివాసీ తెగలలో పండగలకు, పూజలకు ప్రత్యేకత ఉంది. కొన్ని కొన్ని తెగలకు కొన్ని ప్రత్యేక పండుగలున్నాయి. చైత్ర మాసంలో ఉగాది పండగను "ఇసిం పండుగ" అనే పేరుతో చేస్తారు. దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి వీరికి ఉండే ఇతరమైన పెద్ద పండుగలు. కొండ జాతులవారు జనవరి నెలలో 'పూస పండోయి' అను పండగను చేస్తారు. ఉగాది వరకు కొత్త చింతపండు, కొత్త మామిడికాయను తినకపోవడం; వినాయక చవితి వరకు కొత్త చింతకాయను తినకపోవడం; సంక్రాంతి వరకు చెరుకును తినకపోవడం వంటివి ఆదివాసీ తెగలలో కనిపిస్తాయి.

కొండదొరలకు ముఖ్యమైన పండుగ "కడకు పండోయి". దీనిని సాధారణంగా ఏప్రిల్ నెలలో జరుపుతారు. ఈ పండగలో వారికి ఉన్న వ్యవసాయపు పనిముట్లన్నింటిని కడిగి శుభ్రం చేసి, కోడిని బలిచ్చి, దాని రక్తాన్ని పనిముట్లపై చల్లుతారు. దేవతారాధనలో విభిన్న దేవతలను పూజించినా అందరిలో కనిపించే పండుగలు బోనాల పండుగ, కోతల పండుగ, భూదేవి పండుగ. బోనాల పండుగలో దేవతలను తృప్తిపరచడం, కోతల పండుగలో పంటలు ఇచ్చిన దేవతలకు కృతజ్ఞతలు తెలుపుకోవడం, భూదేవి పండగలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కలిగిన ఆదిమ తెగలు భూదేవిని అర్పించి, పంటలను ప్రసాదించమని కోరడం జరుగుతుంది.

**ముగింపు :**

ఆదిమవాసుల జీవన విధానం వైవిధ్యంగా, సమున్నతంగా ఉంటూ తరతరాలకు వారసత్వంగా వస్తుంది. ప్రకృతిని కాపాడడం, పంచభూతాలు రక్షించడం వంటి అంశాలు వారి జీవన విధానంలో అంతర్భాగంగా ఉంటాయి. వేల సంవత్సరాలుగా ఆదివాసులు అనుసరిస్తున్న సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేడు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. మితిమీరిన పట్టణీకరణ, నగరీకరణ ప్రభావం వారి జీవితాలను కూడా ప్రభావితం చేస్తుంది. అందువలన ఆదివాసీల వైవిధ్యభరితమైన సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యతను ఏ ఒక్కరిపైనో వేయకుండా మనందరం కలిసి ముందుకు సాగాలి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) స్త్రీల సాంప్రదాయ గేయాలు – చింతపల్లి వసుంధర
2) ఆటవికుల జీవన విధానం – చింతపల్లి వసుంధర
3) తెలుగు జానపద విజ్ఞానం సమాజం – సంస్కృతి – సాహిత్యం – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ.